క్లుప్తంగా

పాఠశాలకు ఫ్యాన్‌ల బహూకరణ



ఫ్యాన్‌లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్‌: మండల పరిధిలోని వెలిజర్లలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఫ్యాన్‌లు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుకేందర్, పూర్వ విద్యార్థులు శ్రవణ్‌గౌడ్, రమేశ్, నర్సింహారెడ్డి, కృష్ణ, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌: గ్రామీణ రోడ్లఅభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం నుంచి గంట్లవెల్లి గ్రామం వరకు రూ.8కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బీటీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం పూర్తిగా పట్టణాల నుంచి పల్లెలకు రహదారులను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు భార్గవ్‌కుమార్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న కార్యాలయంపై దాడి హేయమైన చర్య


శంకర్‌పల్లి: తీన్మార్ మల్లన్న కార్యాలయంపై తెలంగాణ జాగృతి కార్యకర్తల దాడి హేయమైన చర్య అని చేవెళ్ల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, శంకర్‌పల్లి కురుమ సంఘం అధ్యక్షుడు బండి వెంకటయ్య అన్నా రు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి గ్రామ కురుమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా జంగయ్య ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లన్న ఆఫీస్‌పై దాడిని చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం కురుమల సంక్షేమం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఈత చెట్లు పెంచేందుకు స్థలం ఇవ్వాలని వినతి

మొయినాబాద్‌రూరల్‌: తోల్‌కట్టలోని ప్రభుత్వ భూమిలో ఈత వనాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయాలని గ్రామ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి శివశంకర్‌గౌడ్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తోల్‌కట్ట గౌడ సంఘం నాయకులతో కలిసి ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తోల్‌కట్ట గ్రామంలో సర్వే నంబర్ 137/అ3 విస్తీర్ణం రెండెకరాలు, 137/ఉ విస్తీర్ణం రెండు ఎకరాల 34 గుంటలు, సర్వే నంబర్ 124లో ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూముల్లో ప్రభుత్వం స్పందించి ఈత చెట్లు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శివయ్యా.. కరుణించయ్యా..

వర్షాలు కురవాలని శివలింగానికి అభిషేకం



శివలింగానికి అభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నందిగామ: తొలకరి వర్షాలకే విత్తనాలు నాటాం.. కొన్ని మొలకెత్తాయి.. మరికొన్ని మొలకెత్తనే లేదు.. అయినా మరోసారి విత్తనాలు నాటాం.. రెండోసారి నాటిన విత్తనాలు ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్నాయి. వర్షాలు లేకపోవడంతో ఆ మొక్కలు ఆదిలోనే ఎండిపోయే ప్రమాదం ఉంది. శివయ్యా.. కరుణించయ్యా.. అంటూ మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామస్తులు గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలోని శివలింగానికి సోమవారం అభిషేకం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు పెద్దఎత్తున తరలి వచ్చి నీటి బిందెలతో అభిషేకం చేశారు. వారంలోపు వర్షాలు పడకపోతే పంటలు ఎండిపోవడం ఖాయమని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, వీరేందర్ గౌడ్, సాములయ్య, శేఖర్ పంతులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్!

- సామర్థ్యానికి మించి వాహనాల్లో లోడింగ్
- వెనుక వచ్చే వారిపై కంకర, డస్ట్
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- కానరాని అధికారుల తనిఖీలు



టార్పాలిన్ లేకుండానే జాతీయ రహదారి గుండా ప్రయాణిస్తున్న డస్ట్ తరలిస్తున్న టిప్పర్

కొత్తూరు: ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన లారీలు, టిప్పర్ల డ్రైవర్లు తమ వాహనాల్లో పలు వస్తువులు, ఇసుక, కంకర, డస్ట్ తరలిస్తున్న సమయంలో సరైన భద్రత పాటించాలి.. తప్పనిసరిగా టార్పాలిన్లు కట్టాలని తరచూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.. అయినప్పటికీ ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డులో రాకపోకలు కొనసాగిస్తున్న టిప్పర్లు భద్రత పాటించకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. భద్రత పాటించాలని వాహనాల డ్రైవర్లను కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

యజమానుల ఆదేశాల మేరకు..

మండలంలోని ఇన్ముల్‌నర్వ, సిద్ధాపూర్ గ్రామాల శివార్లలో స్టోన్ క్రషర్లు కొనసాగుతున్నాయి. నిత్యం వ్యాపారులు తమకు వచ్చే ఆర్డర్లను ఇన్ముల్‌నర్వ–కొత్తూరు, ఇన్ముల్‌నర్వ–షాద్‌నగర్ రోడ్ల మీదుగా జాతీయ రహదారుల గుండా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. డ్రైవర్లు వాటి యజమానుల ఆదేశాల మేరకు టిప్పర్లలో సామర్థ్యానికి మించి కంకర, డస్ట్‌ను తరలిస్తున్నారు. ఈ సమయంలో లారీల్లో నుంచి కంకర, డస్ట్ రోడ్డుపై కింద పడకుండా టార్పాలిన్లు చుట్టడం లేదు. లోడ్ అధికంగా ఉండడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద కంకర రాళ్లు కిందపడుతున్నాయి. ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డు వెడల్పుగా ఉండడంతో టిప్పర్ల డ్రైవర్లు వేగంగా వాహనాలను నడిపే క్రమంలో కంకర వెనకాల వచ్చే వాహనాలకు తగిలి అద్దాలు పగిలిన సందర్భాలు సైతం ఉన్నాయి. దానికి తోడు టార్పాలిన్ కట్టకపోవడంతో గాలికి డస్ట్(రాయిపొడి) ఎగిరి ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర, డస్ట్(రాయిపొడి)ను తరలిస్తున్న భారీ టిప్పర్ల (లారీలు) కారణంగా వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు నిబంధనలు పాటించని లారీలను గుర్తించి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల తనిఖీలు శూన్యం

ఇన్ముల్‌నర్వ–కొత్తూరు, షాద్‌నగర్ రోడ్ల గుండా నిత్యం స్టోన్ క్రషర్లకు సంబంధించిన భారీ వాహనాలు పదుల సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటాయి. కొన్ని వాహనాల్లో సామర్థ్యానికి మించి వస్తువులు, కంకరను తరలిస్తున్నారు. కంకర, డస్ట్ కింద పడకుండా టార్పాలిన్లు కట్టుకోవడం లేదు. వీటి కారణంగా రోడ్లపై పడుతున్న కంకర, డస్ట్‌తో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. కానీ సంబంధిత శాఖల అధికారులు కనీస తనిఖీలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



కంకర, డస్ట్‌తో పాటు ఇతర వస్తువులు తరలించే వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. కింద పడకుండా టార్పాలిన్లు కట్టాలి. ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డులో తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని లారీలపై చర్యలు తీసుకుంటాం.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని వింటేజ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. అధికారులు, పాలకవర్గాలు నిర్దిష్టమైన ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని కోరారు. ముఖ్యంగా సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దని, సకాలంలో పరిష్కరించి ప్రభుత్వానికి, అధికారులకు గుర్తింపు వచ్చే విధంగా బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ పాలకవర్గం పట్టణ అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. వార్డుల వారీగా అవసరం ఉన్న పనులు, ప్రాధాన్యత పనులు అందులో పొందుపర్చి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పాలకవర్గానికి నిధుల సహకారంలో తనవంతు సాయం చేస్తానని వివరించారు. అనంతరం కాలనీలో విద్యుత్ సమస్య ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే సమస్య పరిష్కరించడంపై ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఏడీ రవీందర్, ఏఈ రమేశ్‌గౌడ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, సోమ్లానాయక్, దేవేందర్‌యాదవ్, యాదయ్య, శివశంకర్‌గౌడ్, జనార్దన్‌చారి, జగన్, సత్తయ్య, ప్రభాకర్, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

నందిగామ: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని తాళ్లగూడలో హెచ్‌ఎండీఏ నిధులు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న మురుగు కాల్వలు, రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు కుమారస్వామీగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, సురేందర్, శ్రీశైలం, బుచ్చయ్య, కావలి కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బీఆర్‌ఎస్ హయాంలో బీసీలకు అన్యాయం

కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్



మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో బీసీలను అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతానికి పెంచుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై ఆయన సోమవారం పలువురు నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు బాగుపడ్డట్లు గుర్తుచేశారు. గతంలో 33 శాతం ఉన్న బీసీల రిజర్వేషన్లను బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 22 శాతానికి కుదించినట్లు తెలిపారు. కాగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట మేరకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేసిందన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను విజయవంతంగా అమోదింపజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి నాయకుల దాడిని ఆయన ఖండించారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌ముదిరాజ్, అంబటి ప్రభాకర్, సత్తయ్య, నర్సింహ, నవీన్‌చారి, శివశంకర్‌గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

షాద్‌నగర్‌రూరల్‌: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోందని, దానికి కాపాడాలని కోరుతూ గ్రామస్తులు కమిషనర్ సునీతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సోలీపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 30, 31లలో ప్లాట్లు ఏర్పాటు చేశారని, అందులో కొంత భూమిని మున్సిపాలిటీకి కేటాయించినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం కొందరు వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సింగపాగ అనిల్ కుమార్, బాబు, సోమ్లా, రవి, సురేశ్, మున్నా, కిషోర్, ప్రకాశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

నియామకం



రవికుమార్‌కు నియామకపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సీహెచ్ రవికుమార్ ఎన్నికయ్యారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి చేతుల మీదుగా రవికుమార్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన మాజీ మంత్రి సబితారెడ్డి, నాయకులు కార్తీక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్, అంజనేయుల తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు ప్రభాకర్, వనం మహేందర్‌రెడ్డి, దేశమొళ్ల అంజనేయులు, నర్సింలు, ఇమ్రాన్, శ్యామ్, మానిక్యరెడ్డి, మహేందర్, శివారెడ్డి తదితరులు ఉన్నారు.

సన్మానం



రాజీవ్‌పైలెట్‌ను సన్మానిస్తున్న నాయకులు

కేశంపేట: తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన రాజీవ్‌పైలెట్‌ను పలువురు రైతులు, నాయకులు సోమవారం అభినందించారు. మండలంలోని నిర్దవెళ్లి గ్రామ పశువైద్య ఉపకేంద్రంలో జూనియర్ వెటర్నరీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజీవ్‌పైలెట్‌ను గ్రామ రైతులు, నాయకులు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దిద్దెల జంగయ్య, పద్మజీ, నిరంజన్, మహేందర్, బాలరాజ్, బచ్చయ్య, వెంకటేశ్, శంకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి బండారు రమేశ్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్‌: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారు రమేశ్ అన్నారు. ఆషాఢ మాసం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని వినాయక్ గంజ్ గణపతి దేవాలయంలో సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌తో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వన్నాడ వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, అభిలాష్, ప్రవీణ్, ప్రదీప్, కోటిలింగంగౌడ్, రాజేశ్వర్, గోపాల్, శ్రీధర్, ఆగీరు కృష్ణయ్య, శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, గజవాడ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



గుంతలు పూడ్చి వేయిస్తున్న యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు

మొయినాబాద్‌రూరల్‌: యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావడం అభినందనీయమని చిన్నమంగళారం తాజా మాజీ సర్పంచ్ సుకన్యహరిశంకర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి నుంచి చిన్నమంగళారం వరకు గుంతలుపడిన రోడ్డుకు యువకుడు విష్ణుగౌడ్ రూ.లక్ష సొంత డబ్బులతో మరమ్మతులు చేయించాడు. ఈ సందర్భంగా ఈ రోడ్డు పనులను మాజీ ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రెడ్డిపల్లి నుంచి చిన్నమంగళారం వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డులో అడుగడుగునా గుంతలు పడడంతో ఆర్టీసీ బస్సు గ్రామానికి రాదని తెలపడంతో.. వెంటనే స్పందించిన విష్ణుగౌడ్ మరమ్మతులకు సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గోపాల్, శంకరయ్య, మోర శ్రీనివాస్, రాంచందర్, రాజు పాల్గొన్నారు.

బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

కమ్మెట చౌరస్తాలో రోడ్డుపై బైఠాయింపు

చేవెళ్ల: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని కోరుతూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. మండలంలోని కమ్మెట–ఎన్కేపల్లి చౌరస్తాలో సోమవారం ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సులు సమయానికి రావటం లేదని, తగిన సంఖ్యలో సర్వీసులు లేవని రోడ్డుపై ధర్నాకు దిగారు. మండలంలోని కమ్మెట, ఎన్కేపల్లి, గొల్లగూడ, ఈర్లపల్లి తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు కమ్మెట–ఎన్కేపల్లి చౌరస్తా నుంచి అటూ శంకర్‌పల్లి, చేవెళ్ల, హైదరాబాద్‌లకు నిత్యం వెళ్తుంటారన్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో తమకు సరిపడా బస్సులు రావటం లేదని, దీంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఉదయం సమయంలో విద్యార్థులు సమయానికి రాకపోవటంతో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని వాపోయారు. ఈ ధర్నాతో ట్రాఫిక్ జామ్‌తో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి, డిపో అధికారులతో మాట్లాడిస్తామని నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి



మాట్లాడుతున్న అనంతరెడ్డి

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్‌: ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవితకు, రాష్ట్ర మహిళలకు తీన్మార్ మల్లన్న వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి అనంతరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో పెట్టుకొని బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత ధర్నా చేయడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపి ఆర్డినెన్స్ తెచ్చారన్నారు. ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆడపడుచులను కించపరిచేలా ఉన్నాయన్నారు. దీనిపై ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవుఫ్, మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌యాదవ్, కుమార్, నాయకులు సురేందర్‌గౌడ్, రవి యాదవ్, అంజయ్యగౌడ్, హరిశంకర్‌గౌడ్, అరవింద్ రజక, ప్రవీణ్, రాము, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న నాయకులు

షాబాద్‌: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క శ్రీనివాస్‌గౌడ్, జడల రాజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలు పెడితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఓట్ల కోసం ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను మోసం చేయాలని చూస్తే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్వకోల్ వెంకట్‌యాదవ్, ముజ్రంఖాన్, ఇమ్రాన్, సురేష్‌గౌడ్, సత్తయ్య, సందీప్, బాల్‌రాజ్, సత్యం, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు 40 మంది ఆ పార్టీకి రాజీనామా చేసి వారి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే, నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేలా ఐక్యంగా పని చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, ఖాజామీయా, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి